

నాణ్యతగా సీసీ రోడ్డు పనులు చేపట్టాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 21: ఉపాధి నిధులతో చేపటడుతున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీవో రాఘవులు సూచించారు. బుధవారం బషీరాబాద్‌లోని టాకీతండాలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. నిర్ణీత వ్యవధిలో పనులు బిల్లులు వస్తాయన్నారు. మిగతా గ్రామాల్లో కూడా లోక్‌సభ ఎన్నికల కోడ్‌కు ముందే సీసీరోడ్ల పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కొడంగల్‌కు ఉజ్వల భవిష్యత్



కోస్గిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం బహిరంగ సభకు హాజరైన ప్రజలు

ఎన్నికల తర్వాత కొడంగల్ అభివృద్ధికి మరో రూ.500 కోట్లు మంజూరు

- శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లకుపైగా నిధులు
- సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 21: అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పథంతో ఉజ్వల భవిష్యత్‌ను సంతరించుకుంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి విడతగా కొడంగల్ ప్రాంతానికి భారీ నిధుల మంజూరుతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు ఈ ప్రాంత బిడ్డగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలతో రెండేళ్లలో సాగునీరస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలోని పూడూరు ప్రాంతంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న నేవీ రాడార్ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పాటు కొడంగల్ నుంచి అత్యధిక మెజార్టీ అందించాలన్నారు. ఎన్నికల అనంతరం తిరిగి కొడంగల్ అభివృద్ధికి మరో రూ.500 కోట్ల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.16 కోట్లకుపైగా నిధుల మంజూరు ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే బడి, గుడి ఇతరాత్ర అభివృద్ధి జరిగాయని గుర్తు చేశారు.

సభ విజయవంతం

తొలి సారిగా సీఎం హోదాలో కోస్గి పర్యటనకు వచ్చిన రేవంత్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతమైంది. రేవంత్‌రెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో బీజీగా ఉండటంతో సోదరుడు తిరుపతిరెడ్డి అన్నీ తానై జన సమీకరణతో సభను విజయవంతం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన

సీఎం హోదాలో మొదటిసారిగా బుధవారం కోస్గి పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అందులో ప్రధానంగా కొడంగల్-నారాయణపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఎత్తిపోతల పథకానికి రూ.2,945 కోట్లతో శంకుస్థాపన, రూ.6.8 కోట్ల వ్యయంతో కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణం, రూ.344.5 కోట్లతో కొడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ లైన్ నుంచి డబుల్ లైన్ రోడ్డు, విస్తరణ పనులు, పలు బ్రిడ్జి నిర్మాణాలు, రూ.27.886 కోట్లతో వికారాబాద్ జిల్లాలో బీటీ రోడ్డు సదుపాయం లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం, రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ హస్టల్ భవన నిర్మాణం, రూ.25 కోట్లతో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ శాశ్వత భవన నిర్మాణం, రూ.40కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.713కోట్లతో దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.7.13 కోట్లతో బొంరాస్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.25 కోట్లతో నీటూర్ గ్రామం దౌల్తాబాద్ మండలంలో మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల నిర్మాణం, రూ.360 కోట్లతో చంద్రకల్ గ్రామం, దౌల్తాబాద్ మండలంలో నూతన వెటర్నరి కళాశాల నిర్మాణం, రూ.25 కోట్లతో కొడంగల్ మండల కేంద్రంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల, రూ.224.50 కోట్లతో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, 220 పడకల ఆసుపత్రి, రూ.213.2070 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో హెల్‌ఎల్పీఎస్, అప్రోచ్ రోడ్డు పనులు, రూ.3.99 కోట్లతో దుద్యాల మండలంలోని హస్నాబాద్ గ్రామంలో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.

సీఎం అంటూ నినాదాలు

కోస్గి పర్యటన ముగించుకొని సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ మీదుగా వెళ్తున్నారనే సమాచారంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలో గుమిగూడారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకోగానే కార్యకర్తలు సీఎం సీఎం అంటూ నినాదాలు చేస్తుండగా తన కాన్వాయ్‌ను ఆపి అభివాదం చేస్తుండగా కార్యకర్తలు దూసుకెళ్లారు. పలువురు కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డిని పూల మాలలతో సన్మానించారు.

సర్కారు స్థలాలు అక్రమార్కులకు వ్యాపార కేంద్రాలుగా మారాయి. హెచ్‌ఎండీఏ స్థలాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు ఏర్పాటు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కొందరు నాయకులు రాత్రికి రాత్రే హోర్డింగులు ఏర్పాటు చేసి వ్యాపార ప్రకటనల కోసం అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ స్థలాల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసిన అక్రమార్కుల వైపు అటు హెచ్‌ఎండీఏ, ఇటు మునిసిపల్ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. దీంతో సర్కారు ఆదాయానికి భారీ గండి పడుతోంది. పొట్టకూటి కోసం రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారిపై మాత్రం తన ప్రతాపాన్ని చూపుతున్నారు. ఆగమేఘాల మీద వారిని ఖాళీ చేయిస్తున్నారు.



ఘట్‌కేసర్‌లోని ఔటర్ చౌరస్తా వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్

సర్కారు స్థలాల్లో ప్రైవేటు దందా!

జోరుగా వ్యాపారాలు.. భారీ హోర్డింగులు.. అదే స్థాయిలో అద్దెలు

- పట్టించుకోని హెచ్‌ఎండీఏ అధికారులు
- పెద్దలను వదిలి.. చిరువ్యాపారులపై ప్రతాపం
- అక్రమ హోర్డింగుల తొలగింపులో దోబూచులాట

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 21: ఘట్‌కేసర్‌లో ఔటర్ సర్వీసు రోడ్డు కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన స్థలాలు కొందరు నాయకులకు వ్యాపార కేంద్రాలుగా మారాయి. రోడ్లకు ఇరువైపుల భారీ పిల్లర్లు నిర్మించి ఎలాంటి అనుమతులు లేకుండానే రాత్రికిరాత్రే హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యాపార ప్రకటనల కోసం అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని రోడ్డు స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ స్థలాల్లో ఏళ్ల తరబడి తిష్టవేసిన వారి జోలికి వెళ్లకుండా రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసే వారిపై అధికారుల తన ప్రతాపాన్ని చూపుతున్నారు. ఆగమేఘాల మీద వారిని ఖాళీ చేయిస్తున్నారు. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి కలిసే చోట అన్నోజిగూడ వైపున ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన ఇటీవల చిరు వ్యాపారులు టీ కొట్టుతో పాటు, భోజనం కోసం చిన్న డబ్బాను ఏర్పాటు చేసుకున్నారు. ఇంకేముంది హెచ్‌ఎండీఏ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో వచ్చి తక్షణమే ఈ స్థలాన్ని ఖాళీ చేయాల ఆదేశించారు. చేసేదేమీలేక ఆ చిరువ్యాపారుల్లో ఒకరు డబ్బాతో సహా ఖాళీ చేసి వెళ్లి పోగా, మరొకరు డబ్బాను మూసి వేశాడు. ఇక్కడ ఇంత కఠినంగా వ్యవహరించిన హెచ్‌ఎండీఏ అధికారులు ఘట్‌కేసర్ వైపు మళ్లే చౌరస్తాలో మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. ఇక్కడ భారీగా దుకాణాలున్నాయి, అక్రమంగా హోర్డింగులు వెలిశాయి. అయినా అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమ హోర్డింగులపై హెచ్‌ఎండీఏ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మూడు దఫాలుగా అధికారులు యంత్రాలలో రావడం కొద్ది సేపు అక్కడ హల్‌చల్ చేయడం తప్పా చేసిందేమీ లేదు. హోర్డింగులకున్న ఫ్లెక్సీలను తొలగించడం.. ఈ లోపు పై నుంచి ఏదో ఫోన్ రావడంతో వెళ్లి పోవడం నిత్యకృత్యంగా మారింది. దీంతో అక్రమార్కులు వెంటనే తిరిగి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం షరామాములుగా మారిపోయింది. ఇప్పటికైన హెచ్‌ఎండీఏ అధికారులు స్పందించి ఘట్‌కేసర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తొలగించి స్వాధీనం చేసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



అన్నోజిగూడ వద్ద అధికారుల హెచ్చరికలతో ఖాళీ చేస్తున్న చిరువ్యాపారి

ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరులవే...



ఘట్‌కేసర్‌లో ఔటర్ జంక్షన్ కోసం హెచ్‌ఎండీఏ సేకరించిన స్థలంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి అండదండలతో ఆయన అనుచరులు కొందరు అక్రమంగా హోర్డింగులు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించక పోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వ స్థలాల్లో బీఆర్‌ఎస్ నాయకుల వ్యాపారాలు అధికారులకు కనింపించడం లేదా?. చిన్నచిన్న నిర్మాణాలకే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులకు ఇక్కడ చూసిచూడనట్లు వ్యవహరించడం విచారకరం

- అబ్బసాని యాదగిరి, మాజీ సర్పంచ్, ఘట్‌కేసర్

తక్షణమే చర్యలు తీసుకోవాలి



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ లో పలు చోట్ల అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తక్షణమే తొలగించాలి. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా హోర్డింగులు పెట్టారు. స్థానిక ఎదులాబాద్ రోడ్డులో హోర్డింగ్ తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగతా వాటిని అలాగే వదిలేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన హోర్డింగులను తొలగించాలి

- మేకల పద్మారావు, కౌన్సిలర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ



అస్పత్రిని సందర్శించిన ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ

పరిగి ఆస్పత్రి స్థాయి పెంపును పరిశీలిస్తాం

- రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ

పరిగి,ఫిబ్రవరి 21: పరిగి ప్రభుత్వ అస్పత్రి స్థాయిని పెంచేందుకు పరిశీలిస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ, వైద్యవిధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పరిగి ప్రభుత్వ అస్పత్రిని వారు సందర్శించారు. అస్పత్రిలో అన్ని వార్డులు, బ్లడ్‌బ్యాంకు, డయాలసీస్ కేంద్రాలను పరిశీలించారు. రోగులు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అస్పత్రి నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. పరిగి అస్పత్రి స్థాయి పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డాకర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అస్పత్రి స్థాయి పెంపు, ఖాళీలను భర్తీ, అన్ని రకాల వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే డాక్టర్లు, సిబ్బంది స్థానికంగా ఉండి సేవలు అందిస్తామని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఈవో డాక్టర్ ప్రదీప్, పరిగి అస్పత్రి సూపరిండెంట్ రాజశేఖర్, డాక్టర్ వెంకటరత్నం, సరిత తదితరులు పాల్గొన్నారు.



పాత కొడంగల్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న శాంతికుమారి

ఎడ్యుకేషనల్ హబ్ స్థలం పరిశీలన

కొడంగల్, ఫిబ్రవరి 21: పాత కొడంగల్‌లో చేపట్టనున్న ఎడ్యూకేషనల్ హబ్ స్థలాన్ని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పరిశీలించారు. బుధవారం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి కుంచారం వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీవో శ్రీనివాస్, కొడంగల్ తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎస్ వెంట రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీఎంకు 60 రోజుల్లో ఓటమి చురక

- బీఆర్‌ఎస్ పార్టీకి దిక్కులేదు... కాంగ్రెస్‌కు క్యాండిడేట్ లేదు
- చేవెళ్ల, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలు బీజేపీవే
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



వికారాబాద్‌లో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 21 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 60 రోజుల్లో ఓటమి చురక ఉంటుందని, ఆయన ఇన్‌చార్జిగా ఉన్న చేవెళ్ల, మహబూబ్ నగర్ పార్లమెంట్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం అనంతగిరిలోని హరితరిసార్ట్స్‌లో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమారెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి దిక్కులేదని, చేవెళ్ల పార్లమెంట్‌కు కాంగ్రెస్‌కు క్యాండిడేట్ లేరన్నారు. అందుకోసమే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి నాయకులను అప్పు తీసుకుంటుందన్నారు.గల్లీలో ఎలాగో బయట పడ్డ కాంగ్రెస్ ఢిల్లీలో బొక్క బోర్లపడుతుందన్నారు. విశ్వగురువుగా మారినటువంటి భారతదేశాన్ని నడిపించే వ్యక్తి నరేంద్ర మోదీనే అన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమారెడ్డి మాట్లాడుతూ. విజయసంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మరో సారి ఆశీర్వదించి చేవెళ్లపార్లమెంట్ స్థానాన్ని మోడీకి అందించాలని కోరారు. మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. దేశంలో, రాష్ట్రంలో, పార్లమెంట్‌లో బీజేపీ గ్రాప్ పెరిగిందన్నారు. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సదానందారెడ్డి, శివరాజు, నాయకులు పాండుగౌడ్, పోకల సతీష్, మల్లారెడ్డి, నందకుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, శిరీష, బస్వలింగం తదితరులు పాల్గొన్నారు.



మన్నెగూడలో రోడ్‌షోలో పాల్గొన్న కార్యకర్తలు

పూడూరులో రోడ్‌షో

పూడూరు : బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా పూడూరు మండల పరిధిలోని రాకంచర్ల నుంచి మన్నెగూడ వరకు రోడ్‌షో జరిగింది. మన్నెగూడ చౌరస్తాలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కిరన్ బోనేటి, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డిలను పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, మండల అధ్యక్షుడు అనిల్ గజమాలతో సన్మానించారు. అనంతరం అందరూ కలిసి చేవెళ్లకు తరలివెళ్లారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎంపీ ల్యాండ్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీడీపీ, ఎంపీ, ఎస్‌డీఎఫ్, సీబీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతిపై జిల్లా ప్రణాళికా అధికారి మోహన్‌రావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలన్నారు. ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, అటవీశాఖ జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, ఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు , ఎండీవోలు, అధికారులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను గుర్తించాలి

ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు అన్నింటిని గుర్తించి గూగుల్ మ్యాప్ తయారు చేయాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీలార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న సీలింగ్ భూములు అన్నింటిని ధరణీలో క్రయవిక్రయాలు జరుగకుండా చూడాలన్నారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న వాటిని కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. హౌజింగ్ బోర్డు ల్యాండ్‌లను కాపాడాలన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి గూగుల్ మ్యాప్‌ను తయారు చేయాలని సూచించారు. ఓఆర్‌ఆర్ చుట్టూ ఇండస్ట్రీయల్ పార్కులు స్థాపించడానికి ప్రభుత్వ స్థలాలు గుర్తించాలన్నారు. మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న టీఎస్‌బీపాస్ దరఖాస్తులను పరిశీలించి పంపాల్సిందిగా కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో శ్యాంప్రకాష్, పాల్గొన్నారు. కాగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ డైరీ, క్యాలెండర్‌లను కలెక్టర్ గౌతమ్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 21: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే విధి నిర్వహణలో సంతృప్తి కలుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం గద్వాల్ జిల్లాకు బదిలీపై వెళ్లిన జిల్లా పౌర సంబంధాల అధికారి మమ్మద్ ఆరిఫుద్దీన్‌కు పాత్రికేయులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికారులు, పాత్రికేయులతో సమన్వయం చేసుకుని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో డీపీఆర్‌వో ఆరిఫుద్దీన్ కృషి అభినందనీయమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాత్రికేయులను సమన్వయపరచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తన విధులను నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ, సహాయ పౌర సంబంధాల అధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సతీష్ కుమార్, నాగలక్ష్మి, దస్తమ్మ పాత్రికేయులు పాల్గొన్నారు.



డీపీఆర్‌వోను శాలువాతో సత్కరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రైతులను అరెస్టు చేయడం సరికాదు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 21: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో తమను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పలువురు రైతులు ఆరోపించారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లిలో గల సర్వే నెం.19 భూములకు సంబంధించిన రైతులుబుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నెల రోజులుగా తమ భూములను తీసుకోవద్దని చేస్తున్న ఉద్యమాన్ని నీరుగార్చే ఉద్దేశంతో కొంత మంది రెవెన్యూ, పోలీసు శాఖలతో కుమ్మక్కై ఆరుగురు రైతులను అరెస్టు చేయించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎరన్‌పల్లి శ్రీనివాస్, పకీరప్ప, నర్సప్ప, మోతిబాయి, దుబ్బ బాలప్ప పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అప్పాయిపల్లి రైతులు

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

● ఎంపీపీ సత్యహరిశ్చంద్ర

కులకచర్ల, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్తాయని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. కులకచర్ల చెరువు హనుమాన్ ఆలయంవద్ద బుధవారం ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డుపనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, ఎంపీటీసీ ఆనందం, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు వెంకటయ్యగౌడ్, వెంకటేశ్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యహరిశ్చంద్ర


కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య


భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం


జంపన్నవాగులో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు









మేడారం.. జన సంద్రం..

- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభం జనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే.. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్టు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావి స్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించు కున్న భక్తులు కాక వీరు అదనమని అధి కారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలి ఘట్టమైన సార లమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసా రిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమ త్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రి స్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

●అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు-2024 నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షలు ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఇందుకోసం 231 పరీక్షా కేంద్రాలు కేటాయించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 46,834 మంది, ప్రయివేటు 572 మంది మొత్తం 47,406 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఈఓ విజయలక్ష్మీ, ఇంటర్మీడియట్ విద్యాధికారి కిషన్ పాల్గొన్నారు.

సంగాయపల్లి అడవిలో ఆగని నరికివేత

●ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో విచారణ


అడవిలో నరికివేసిన చెట్లు

ధారూరు, ఫిబ్రవరి 21 : ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని సంగాయపల్లి బీట్‌లో అడవిలో చెట్లు నరికివే సిన ప్రాంతాన్ని ఆ శాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో పరిశీలించి, విచారణ జరిపిన (మంగళవారం) రోజు రాత్రే మరలా చెట్ల నరికివేత కొనసాగింది. రాస్నం అటవీ సెక్షన్‌లోని సంగాయపల్లి బీట్‌లో మంగళవారం రాత్రి పలువురు పెద్దపెద్ద చెట్లను నరికి కుప్పలు వేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకు న్నారు. పెట్రోలింగ్ నిర్వహించకపోవటంతో రాత్రికి రాత్రే చెట్లను తొలగించి ఎండిపోయాక ఆ స్థలాన్ని చదును చేసుకుంటున్నారని తెలిసింది. అడవిని నరికిన వారిపై చర్యలు తీసుకునేందుకు అట వీశాఖ అధికారులు జంకుతున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న ధారూరు అటవీ రేంజ్‌లో నరికివేత కొనసాగుతున్నా అటవీశాఖ జిల్లా అధికారులు ఇంతవరకు అటువైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. కాగా ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో వెంకటేశ్వర్లు మంగళవారం క్షేత్రస్థాయిలో విచా రణ జరిపినట్లు సమాచారం. ఎంత విస్తీర్ణంలో అడవిని నరికి దగ్ధం చేశారనే అంశంపై ఆయన విచారించినట్లు తెలిసింది. కొంత భాగాన్నే ఫారెస్టు రేంజ్ అధికారులు ఆయనకు చూయించి మిగ తాది చూపించకుండానే పంపించారని విశ్వసనీయ సమాచారం. కాగా ఈ సంఘటనపై అటవీ అధికారులు పట్టింపులేనట్లుగా వ్యవ హరించటం పలు అనుమానాలకు తావిస్తోంది. సరైన చర్యలు తీసుకోకపోతే అడవి మనుగడకు ప్రమాదం ఉందని పరిసర గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేడు ఉప్పరిగూడ పీఏసీఎస్ విశ్వాస పరీక్ష

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 21: ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరి గూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి సంబంధించి నేడు (గురువారం) ప్రత్యేక సమావేశంలో విశ్వాసపరీక్ష జరుగనుంది. ఇటీవల వారిపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలి సిందే. ఈ పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లుండగా ఐదు గురు బీఆర్ఎస్, ఆరుగురు కాంగ్రెస్ మద్దతుదారులున్నారు. కాంగ్రెస్ డైరెక్టర్లకు తోడు ఐదుగురు బీఆర్ఎస్ మద్దతుదారులు కూడా అవిశ్వాసం ప్రకటించడంతో డీసీవో ధాత్రీదేవి నేడు విశ్వాస పరీక్షకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈరోజు జరిగే ప్రత్యేక సమావే శానికి హాజరుకావాలంటూ డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు. ఉదయం 11. 30 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది.

కేసీఆర్ కుటుంబం జైలుకెళ్లడం ఖాయం

●బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్


మాట్లాడుతున్న హరీష్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్,

మేడ్చల్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన కల్వకుంట్ల కుటుంబం జైలుకెళ్లడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని వెలికితీయడానికి కేంద్రం సహకారం కూడా ఉంటుందని వారు చెప్పారు. పాత బోయిన్‌పల్లిలోని హస్మత్‌పేటలోని ఆ పార్టీ అర్బన్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీతో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డికి కప్పం కట్టాల్సిందేనని విమర్శించారు. ఈ నెల 24న బీజేపీ విజయ సంకల్ప యాత్ర మల్కాజిగిరి పార్లమెంటులోకి అడుగుపెడుతుందని, ఆ యాత్రను విజయవంతం చేయాలని వారు కోరారు. ఆరోజు ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, 27న సికింద్రాబాద్ , కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో యాత్ర ఉంటుందని వారు వివరించారు. విజీత్‌వర్మ, ఆర్.కె.శ్రీనివాస్, పప్పు పటేల్, సంతోష్ పాల్గొన్నారు.

జననేంద్రియ వ్యాధులపై అవగాహన అవసరం


అవగాహన కార్యక్రమంలో ఉపాసన, డాక్టర్ రూమా సిన్హా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళల జననేంద్రియ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. పెయిర్ అకాడమీ, అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఓపెన్ ఎయిర్ యాంఫీ థియేటర్‌లో బుధవారం ఎండోమెట్రియోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. ఎండోమెట్రియోసిస్ గర్భాశయం యొక్క లైనింగ్ లాంటి కణజాలం అని, ఇది గర్భాశయం వెలుపల పెరుగుతుందని తెలిపారు. మహిళలు ఆరోగ్య సమస్యలపై ఓపెన్‌గా మాట్లాడేందుకు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. సమాజంతో పాటు కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అపోలో ఆస్పత్రుల ఎంటర్‌ప్రైజెస్ సీఎస్ఆర్ వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కామినేని మాట్లాడుతూ.. మహిళలు తమ భావాలను వ్యక్తం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఎండోమెట్రియోసిస్ స్పెషలిస్టు డాక్టర్ రూమా సిన్హా, పేషెంట్ అకాడమీ ఫర్ ఇన్నోవేషన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ రత్నాదేవి, డాక్టర్ కార్మాన్ నెజాట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న డీఈవో

వెూమిన్ పేట్, ఫిబ్రవరి 21 : విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గుణితాన్ని బోధించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. బుధవారం మండలంలోని అమ్రాదికలాన్, మల్లారెడ్డిగూడ పాఠశాలలను ఎంఈవో గోపాల్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూడికలు, తీసివేతలు, భాగాహారాలను సరళమైన పద్ధతిలో, అర్థమయ్యే విధంగా బోర్డుపై చెప్పాలన్నారు. ఏకోపాధ్యాయులు ప్రతీ రోజు పాఠశాలలకు హాజరు కావాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 21 : అధికారం పోయిందన్న ఆవేదనలో బీఆర్ఎస్ నేతలు నోటికి వచ్చినట్లు వాగుతున్నారని, మంగళవారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమవేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నేతలు అన్నారు. బుధవారం పీసీసీ సభ్యుడు మహమ్మద్ అలీఖాన్ బాబర్, గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజుగౌడ్, నాయకులు చెంది తరుపతిరెడ్డి, శ్రీను నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. వాస్తవాలను వెలుగులోకి తెస్తోందన్న అక్కసుతోనే ఆంధ్రజ్యోతి పత్రికపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని, అన్ని పత్రికలు నమస్తేతెలంగాణ లాగా గులాంగిరి వార్తలు రాయవని విమర్శించారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ నాయకుల ధర్నా

వికారాబాద్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక పోకడలతో ముందుకు సాగిందన్నారు. ఈ ప్రభుత్వమైనా విద్యార్థుల పక్షాన ఉంటుందంటే విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తోందన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయి గణేష్ టౌన్ జాయింట్ సెక్రెటరీ జగదీశ్‌చారి, అనిల్, ఆదికేశవ, మంజునాథ్‌రెడ్డి, మురళి, కార్తీక్, శ్రీధర్, సంజు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో వైభవంగా దీపోత్సవం



దర్గాలో దీపాలు వెలిగిస్తున్న మాజీ ఎమ్మెల్యే కుటుంబీకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని ఉర్సె షరీఫ్ హజ్రత్ శంషా ఖాద్రీ దర్గాలో ఉర్సు ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు దీపోత్సవ కార్యక్రమాన్ని కమిటీ నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలుచేశారు. దర్గాను తాండూరు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావు, మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్‌మహారాజ్, రోహిత్‌మహారాజ్ సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా కమిటీ అధ్యక్షుడు మస్తాన్, ఉపాధ్యక్షుడు షేక్ మహిమూద్, కార్యదర్శి ఎండీ.చంద్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ అమ్జద్, కోశాధికారి షేక్ మక్బూల్, మునీర్, ఖాలేద్, రాముడునాయక్, పవాన్‌ఠాగూర్, నర్సింహా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న వెంకటేష్

వికారాబాద్, ఫిబ్రవరి 21 : నేటి యువత చట్టాలపై తగిన అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేష్, డిప్యూటీ డిఫెన్స్ న్యాయవాది రాము అన్నారు. వికారాబాద్ పట్టణంలోని తక్షశిల డిగ్రీ కళాశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల విద్యార్థులకు న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ భూమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాండూరులో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



తాండూరు అపెక్స్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 21: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ ఆదేశానుసారం బుధవారం వైద్యాధికారులు పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. అన్ని ఆస్పత్రుల్లో జరిగే ప్రసవాలను ఈ బర్త్ పోర్టల్‌లో కచ్చితంగా నమోదు చేయాలని, గర్భిణులకు చేసిన స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు చెప్పారు. అన్ని ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లు కచ్చితంగా నమోదు చేసుకోవాలని, లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో డాక్టర్ సాయి బాబా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెంకాయల బహిరంగ వేలం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 21: దుద్యాల మండలంలోని పోలెపల్లి దేవస్థానంలో బుధవారం దేవాదాయ ధర్మదాయ శాఖ ఈవో నరేందర్ ఆధ్వర్యంలో టెంకాయల బహిరంగ వేలం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు విక్రయించేందుకు వేలం నిర్వహించగా యాదాద్రి జిల్లా రామన్నపేట్ గ్రామానికి చెందిన శంకర్ రూ.4లక్షలా 91వేలకు దక్కించుకున్నారు. వేలంలో దేవస్థాన మేనేజర్ రాజేందర్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, ఫిబ్రవరి 21: మండలంలోని తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిపల్లిలోని శ్రీపెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. తూంకుంటకు చెందిన సిద్దంశెట్టి వెంకటేశంగుప్త జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని భ్రమరాంబ, కుమారుడు రమేష్‌గుప్త కోడలు రామలక్ష్మి, కుటుంబసభ్యులు సంతోష్, అరుణ దంపతులు, జ్యోతి, రిషిక, వీరాజ్‌గుప్తలు అన్నదానం చేపట్టారు.

అన్నదానానికి భక్తుల విరాళం

తాండూరురూరల్, ఫిబ్రవరి 21: తాండూరు పట్టణం ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం కోట్‌పల్లి మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు విశ్వం పంతులు విరాళం అందించి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాజ్‌కుమార్, గోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 21: పరిగిలో నిరుద్యోగ యువత ఉపాధి కల్పించే పరిశ్రమలు స్థాపిస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనకు భూములను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. పరిగికి రైల్వేలైను తీసుకురానున్నట్లు తెలిపారు. నేవీ రాడార్ స్టేషన్‌తో పరిగి చరిత్రలో నిలువనుందన్నారు. 2900 ఎకరాల్లో రూ.2500 కోట్లతో త్వరలోనే పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. స్కూల్, ఆస్పత్రుల నిర్మాణం జరుగుతుందని, స్థానికులకు 15 శాతం రిజర్వేషన్లు ఉంటాయని తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర 20టీఎంసీల రిజర్వాయర్ నిర్మించి పరిగికి సాగునీరు తెస్తానని తెలిపారు. పరిగికి రైల్వేలైను నిర్మాణానికి రూ.3100కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, వైస్ ఎంపీపీ కావలి సత్యనారాయణ, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, డీసీసీ కార్యదర్శులు ఎన్.రామకృష్ణ, జింకల యాదయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కులకచర్ల: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక రైతు వేదికలో బుధవారం 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు రూ.31లక్షల 3596 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుతో పాటు తులం బంగారం అందించనున్నట్లు తెలిపారు. గృహజ్యోతి పథకంలో భాగంగా వచ్చేనెల నుంచి 200 యూనిట్లు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గ్యాస్ సిలిండర్ పథకంతో పాటు విడతల వారీగా అన్ని హామీలు అమలవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ బీ.అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

దోమ: మండలంలోని పాలెపల్లిలో స్థానిక పత్రికా విలేకరి(ఆంధ్రజ్యోతి కాదు) దస్తయ్య స్వామి బుధవారం ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన పడి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న కవయిత్రి డాక్టర్ నీహారిణి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21: మాతృభాషను పరిరక్షించుకోవాలని ప్రముఖ రచయిత్రి డాక్టర్ కొండపల్లి నీహారిణి అన్నారు. అంకుషాపూర్ ప్రిన్సిటన్ కళాశాల అవరణలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీపట్నం కళాశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని భాషల్లో తెలుగు భాష ఎంతో గొప్పదన్నారు. మాతృభాషాను కాపాడుకోవాలని, మాతృభాషా పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాధి, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య, అధ్యాపకురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని గొట్టిగఖుర్దు పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బషీరాబాద్ వైస్‌ఎంపీపీ జడల అన్నపూర్ణ అనంతయ్య మాట్లాడుతూ మాతృభాషాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం స్థానిక తెలుగు భాషోపాధ్యాయులు పడిచర్ల సత్యం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'పాఠశాల పత్రికను ఆమె ఆవిష్కరించారు. అనంతరం సత్యంను సన్మానించారు. తెలుగు భాషకు సంబంధించి నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ హెచ్‌ఎం సి.పార్వతిదేవి, ఉపాధ్యాయులు యన్.శ్రీశైలం, రాంచెందర్, విష్ణుప్రియ, ఉమాదేవి, ప్రవీణ, ఆశనప్ప, చంద్రకళ, యోగిత, సురేష్, దేవప్ప పాల్గొన్నారు.



బషీరాబాద్: గొట్టిగఖుర్దు పాఠశాలలో పాఠశాల పత్రికను ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ

శిథిలావస్థలో బీసీ బాలుర వసతి గృహం

● పెచ్చులూడుతుండటంతో భయాందోళనలో విద్యార్థులు



బీసీ బాలుర వసతి గృహంలో ఊడిపడిన పెచ్చులు

కొడంగల్, ఫిబ్రవరి 21: కొడంగల్ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థలో ఉంది. వసతి గృహం పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి పెచ్చులూడి పడటంతో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. రాత్రి సమయంలో వసతి గృహంలో నిద్రించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఈ వసతి గృహాన్ని అధికారులు పరిశీలించినప్పటికీ ఎలాంటి మరమ్మతు చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

రోడ్డే బస్టాప్.. వాహనదారుల పరేషాన్



నడిరోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

బషీరాబాద్, ఫిబ్రవరి 21: మండలకేంద్రంలో ప్రయాణికుల కోసం ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను రోడ్డు మధ్యలోనే నిలుపుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్ కూడలిలో ప్రయాణికుల తాకిడి ఎక్కువ.. ఈ మార్గం గుండానే వందలాదిగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డు ఇరుకుగా ఉండటం, ఆపై ప్రైవేటు వాహనాలు పదుల సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు రోడ్లపై తిష్ట వేయడంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కాగా బషీరాబాద్‌లో బస్టాండ్ ఉన్నప్పటికీ బస్సులు వెళ్లకపోవడంతో ఏళ్లతరబడి నిరుపయోగంగా ఉంది.

పోట్లీ మహరాజ్ ఆలయాభివృద్ధికి కృషి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 21: పోట్లీ మహరాజ్ ఆలయాభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలో బుధవారం పోట్లి మహరాజ్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి కావాల్సిన నివేదికను వెంటనే సిద్ధం చేయాలని కోరారు. ఆలయ ఆస్తుల పరిరక్షణకు అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో నరేందర్, చైర్మన్ తర్లపల్లి భాను, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీగౌడ్, కౌన్సిలర్లు విజయాదేవి, ప్రభాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భాస్కరయోగి ఇంటికి బీజేపీ నేత లక్ష్మణ్



పరిగిలో తన ఇంట్లో బీజేపీ నేత లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న భాస్కరయోగి

పరిగి, ఫిబ్రవరి 21: పరిగికి చెందిన రచయిత, ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకుడు డాక్టర్ పి.భాస్కరయోగి నివాసానికి బుధవారం రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెళ్లారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్రలో భాగంగా పరిగికి వచ్చిన లక్ష్మణ్, అంతకుముందు భాస్కరయోగి ఇంటికి వెళ్లారు. లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భాస్కరయోగి రచనలు, దేశ ఆర్థిక, సామాజిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

శ్రీశైలానికి శివస్వాముల పాదయాత్ర



శ్రీశైలంకు బయల్దేరిన శివస్వాములు, భక్తులు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 21: మండలంలోని టేకులపల్లి గ్రామం నుంచి శివస్వాములు, భక్తులు బుధవారం పాదయాత్రగా శ్రీశైలానికి బయల్దేరివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 1 వరకు శ్రీశైలానికి చేరుకొని మల్లికార్జున స్వామిని దర్శించుకుంటామని తెలిపారు. పాదయాత్రలో శివస్వాములు నర్సింహారెడ్డి, పాండు, సాయి, ప్రభు, లక్ష్మీరెడ్డి, నాగరాజు, మహేశ్‌తో పాటు యువకులు మల్లారెడ్డి, రాంరెడ్డి, శివకుమార్, బిక్షపతి, పరమేశ్వర్‌రెడ్డి, ఆంజనేయులు, శేఖర్ రెడ్డి, వెంకట్‌గౌడ్, నరేశ్, ప్రసాద్‌గౌడ్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.


వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని ఎదులాబాద్ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి సేవాకాలం, ప్రాభోదకి ఆరగింపు, గోష్టి, మంటప ప్రాకారసేవ నిర్వహించారు. మధ్యాహ్నం తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం దివ్య ప్రబంధ పారాయణం, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పాలచార్యులు, రాంప్రసాద్, వరదరాజులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అభ్యర్థులకు శిక్షణ

వికారాబాద్, ఫిబ్రవరి 21: వికారాబాద్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రానికి ఆసిఫాబాద్ సిద్దిపేట రామగుండం జిల్లాల నుంచి 224మంది ఏఆర్ పోలీసులు శిక్షణకు వచ్చినట్లు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ ఎస్పీ మురళీధర్ తెలిపారు. ఈ మేరకు శిక్షణకు వచ్చిన ఎస్‌సీటీపీసీ పోలీసు అభ్యర్థులతో ఆయన పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో ఇదివరకే అన్ని రకాల వసతులను కల్పించినట్లు తెలిపారు. వచ్చిన అభ్యర్థులను అన్ని విధాలా తర్ఫీదు చేస్తామన్నారు. శిక్షణలో ఉండే వివిధ విధానాలు ఇండోర్ ఔట్ డోర్ సిబ్బందిని అభ్యర్థులకు పరిచయం చేశారు. అభ్యర్థులంతా శిక్షణ కేంద్రంలో నియమ నిబంధనలను, క్రమశిక్షణ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సీఐ వెంకటరమణ నాయక్ ఆర్ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సీఎం బహిరంగ సభకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు


కులకచర్ల, ఫిబ్రవరి 21: కోస్గిలో తలపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కులకచర్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తలు, నాయకులు కోస్గికి వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎంపీటీసీ ఆనందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, సొసైటి చైర్మన్ మొగులయ్య, నాయకులు వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు తాండూరు నుంచి బుధవారం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ మాజీచైర్మన్ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

'భగీరథ' నీరు వృథా



ధారూరు, ఫిబ్రవరి 21: ధారూరు శివారులోని వడ్డెర కాలనీ సమీపంలో ఓ మొబైల్ కంపెనీకి చెందిన వారు కేబుల్ నిర్మాణ పనుల కోసం జేసీబీతో తవ్వుతుండగా పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు తగిలి పైపు పగిలింది. దీంతో పైపు పగిలి మిషన్ భగీరథ తాగు నీరు వృథాగా పోయింది. సమాచారం అందుకున్న మిషన్ భగీరథ సిబ్బంది ట్యాంకు నుంచి నీటి సరఫరాను వెంటనే నిలిపివేశారు.

క్రైం కార్నర్

మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

● ఎస్‌వోటీ పోలీసుల ఆకస్మిక దాడి



నాగారంలో స్పా సెంటర్‌ను సీజ్ చేసిన పోలీసులు

కీసర, ఫిబ్రవరి 21: మసాజ్‌సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నాగారం మున్సిపల్‌లో వెలుగుచూసింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన శివం బిస్వా అమ్ముగూడలో ఉంటూ నాగారంలో లావెండర్ స్పా సెంటర్ నిర్వహిస్తున్నాడు. శివం బిస్వా మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎస్‌వోటీ పోలీసులు మంగళవారం రాత్రి స్పాసెంటర్‌పై దాడి చేశారు. స్పా సెంటర్‌కు మసాజ్‌కు వచ్చిన దమ్మాయిగూడకు చెందిన విస్వాన్, రాంపల్లికి చెందిన కార కిరణ్‌తో పాటు వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వహకుడు శివం బిస్వాలను, అదేవిధంగా ముగ్గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని కీసర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా నాలుగు సెల్‌ఫోన్లను, స్వైపింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూగ యువతిపై లైంగికదాడి!

తాండూరురూరల్, ఫిబ్రవరి 21: తాండూరు మండల కేంద్రానికి ఐదు కిలో మీటర్ల దూరంలో గల ఓ గ్రామంలో మూగ యువతిపై లైంగిక దాడి జరిగింది. ఈ ఘటన బుధవారం కరన్‌కోట్ పోలీసుస్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(20) పుట్టుక నుంచి మూగతోపాటు మతిస్థిమితం సరిగ్గాలేదు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూగ యువతిపై లైంగికదాడి చేశాడు. అయితే ఆ యువతి గర్భం దాల్చింది. దీంతో విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు, దివ్యాంగుల సంఘం నాయకులు గ్రామానికి వెళ్లి యువతి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు బాధితురాలి తండ్రి కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కరన్‌కోట్ ఎస్ఐ విమలను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

స్కూటీ-పాలవ్యాన్ ఢీకొని యువకుడి మృతి

● యువతికి తీవ్రగాయాలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 21: స్కూటీని ఓ పాలవ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా యువతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శామీర్‌పేటలో ఆరంజ్‌బౌల్ చౌరస్తా, దర్గా సమీపంలో రాజీవ్‌రహదారిపై బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం నగరంలోని వెస్ట్ మారెడుపల్లికి చెందిన ఓప్రేమజంట శామీర్‌పేట నుంచి మారెడుపల్లికి తమ స్కూటీపై ప్రయాణిస్తున్నారు. వెనుక నుంచి వేగంగా వస్తున్న పాల ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో స్కూటీ నడుపుతున్న లింగప్ప అలియాస్ విక్కీ(24) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ వెనుకాల ఉన్న వైష్ణవి తల, కుడి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని వైష్ణవిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువత

● ఉద్యోగాల పేరిట మోసం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 21: ఉద్యోగం ఇస్తామని నమ్మించి మోసగించిన వారిపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, ఇస్మాయిల్ ఖాన్‌గూడకు చెందిన చిరుగుపల్లి అనూష ఉద్యోగం కోసం ఈనెల 4వ తేదీన లింక్డ్ ఇన్ పోర్టల్‌లో జేఎల్‌కే చైతన్యకు వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంది. గ్రామ్ తేజస్ టెక్నాలజీస్ కంపెనీలో సీనియర్ టెస్ట్ ఇంజనీర్ పోస్టు కోసం ఇంటర్వ్యూ తీసుకున్నారు. అనంతరం ఆమెకు మనీషారావు కొండు అనే వ్యక్తి ఫోన్‌చేసి మరో మూడు రౌండ్ల ఇంటర్వ్యూ తీసుకొని ఉద్యోగానికి ఎంపికైనట్లు జాయినింగ్ లెటర్ ఇచ్చి పుణె రావాలన్నారు. అక్కడ ఉద్యోగంలో చేరిన అనూష అదేరోజు హైదరాబాద్‌కు వచ్చింది. మరుసటి రోజు ఆమెకు చైతన్య ఫోన్ చేసి ఈ ఉద్యోగం రాక ముందు ఆరునెలలు గ్యాప్ ఉండటంతో కంపెనీ ఒప్పుకోవడం లేదని చెప్పాడు. ఈ సమస్యనుంచి తప్పించుకోవాలంటే ఫ్రీలాన్సర్‌గా పనిచేసినట్లు సృష్టించాలని అందుకు రూ.లక్షా 36వేల 800 ఖర్చవుతుందని చెప్పాడు. చైతన్య అడిగిన డబ్బును అనూష విడతల వారీగా చెల్లించింది. అయినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో లింక్‌డిన్ ప్రొఫైల్‌ను పరిశీలించగా అతడిది నకిలీ ప్రొఫైల్ అని తేలింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


పార్ట్‌టైం జాబ్ కోసం యువకుడు..

పార్ట్‌టైం జాబ్‌తో ఎక్కువ సంపాదించుకోవచ్చని చెప్పి మోసగించిన వ్యక్తిపై పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెముల, భరత్‌నగర్‌కు చెందిన కొప్పుల అజయ్‌కుమార్‌రెడ్డికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి గూగుల్ రివ్యూయర్‌గా పార్ట్‌టైం ఉద్యోగం ఉందని చెప్పాడు. దీంతో అజయ్‌కుమార్‌రెడ్డి ఒప్పుకొని మొదటిటాస్క్ పూర్తి చేసుకున్నందుకు రూ.200 వచ్చాయి. ఈనెల 5న అజయ్‌కు టెలిగ్రామ్ లింక్ పంపాడు. ఈ లింక్‌లోని టాస్కలన్నీ పూర్తిచేస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని నమ్మించాడు. వాటిలో ఒక్కోటాస్క్ పూర్తిచేయడానికి డబ్బులు ఖర్చు అవుతుందని చెప్పగా, అందుకు అజయ్ ఒప్పుకున్నాడు. ఇందుకు విడతల వారిగా రూ.1,26,632లను చెల్లించాడు. అయినప్పటికీ అతడికి తిరిగి ఏవిధంగా డబ్బులు రాకపోవడంతో తాను మోసపోయానని తెలుసుకొని పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కులకచర్ల, ఫిబ్రవరి 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. బొంరెడ్డిపల్లిలో బుధవారం పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుబడింది. ఈ మేరకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

త్వరలోనే మాదిగ, ఉపకులాల కల సాకారం



తాండూరులో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, తదితరులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 21: మాది, ఉపకులాల కల త్వరలోనే సాకారమవుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు తాండూరులో బుధవారం సమావేశమై మాట్లాడారు. ఈనెల 6, 7, 8వ తేదీల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపి రిజర్వ్ చేస్తున్నట్లు ఆర్డినెన్స్ జారీ చేసిందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. దండోరా ఉద్యమం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించడానికి 30ఏళ్ల పోరాటం ఇప్పుడు విజయానికి చేరువైందని అన్నారు. మాదిగ, ఉపకులాలు విజయోత్సవానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి జి.ప్రకాష్, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్, ఎంఎస్ఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.